APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 10 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :75 పేజీలు : 04 వెల: 2-00/-



## ఆష్టా విద్యా ప్రాంగణంలో కొత్త భవనాలు

- 'ఆమ్రవృక్ష' ఆత్మకథను ఆవిష్కరించిన సీఎం ఫడణవీస్
- వివిధ విద్యా భవనాలకు ప్రారంభోత్సవాలు
- ఫార్మసీ, పారిశ్రామిక శిక్షణకు కొత్త వసతులు
- కార్యక్రమంలో పలువురు ప్రముఖుల హాజరు

ఆష్టా, ఆగస్టు 9 : మహారాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ అన్నాసాహెబ్ డాంగే జీవిత, సేవా ప్రస్థానంపై రూపొందించిన 'ఆమ్రవృక్ష' ఆత్మకథను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆదివారం ఆవిష్కరించారు. సంగ్లీ జిల్లా ఆష్టాలోని సంత్ జ్ఞానేశ్వర్ విద్యాసంస్థల విద్యా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆష్టా విద్యా ప్రాంగణంలో నిర్మించిన సుభద్ర ఇంటర్నేషనల్ స్కూల్, అన్నాసాహెబ్ డాంగే కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, అన్నాసాహెబ్ డాంగే పారిశ్రామిక శిక్షణ కేంద్రానికి సంబంధించిన భవనాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. విద్యార్థులకు ఆధునిక విద్య, నైపుణ్య శిక్షణ అందించేందుకు ఈ వసతులు ఉపయోగపడనున్నాయి. అన్నాసాహెబ్ డాంగే విద్యా, సామాజిక రంగాల్లో చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు నేతలు గుర్తు చేసుకున్నారు. ఆయన జీవిత ప్రయాణం, ప్రజా సేవ, విద్యా రంగానికి అందించిన సహకారాన్ని ప్రతిబింబించేలా 'ఆమ్రవృక్ష' ఆత్మకథను రూపొందించినట్లు తెలిపారు. విద్యా ప్రాంగణంలో కొత్త భవనాల ఏర్పాటుతో స్థానిక విద్యార్థులకు మరిన్ని విద్యా అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా ఫార్మసీ విద్యతో పాటు పారిశ్రామిక శిక్షణ ద్వారా యువతకు ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు అవకాశం ఏర్పడనుంది.

## ప్రియాంక మృతిపై సీఎం ఆవేదన

అమరావతి, ఆగస్టు 9 : రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత విషాదకరమని పేర్కొంటూ, ఎంతో భవిష్యత్తు ఉన్న యువ వైద్యురాలు అకాల మరణం చెందడం బాధాకరమని అన్నారు. ప్రియాంక మృతికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా, మద్యం మత్తులో వాహనం నడిపి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు.



ఈ ఘటనపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చంద్రబాబు వెల్లడించారు. నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, చట్టపరంగా గరిష్ఠ శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన యువకులను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు పంపిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేసు దర్యాప్తు పారదర్శకంగా, వేగవంతంగా సాగాలని సూచిస్తూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తుందని చెప్పారు.
ప్రియాంక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన చంద్రబాబు, ఈ కష్టకాలంలో ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువతకు ముఖ్యమంత్రి కీలక సందేశం ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంతో డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయని హెచ్చరించారు. క్షణికావేశం లేదా నిర్లక్ష్యం వల్ల ఇతరుల జీవితాలు నాశనం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం



కడప, ఆగస్టు 9 : బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, మద్యం సేవించి వాహనాలు నడపడాన్ని అరికట్టేందుకు కడప జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై పోలీసులు నిఘా పెంచారు. ముఖ్యంగా రహదారులు, బహిరంగ ప్రదేశాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనదారులను తనిఖీ చేస్తూ మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగడమే కాకుండా మహిళలు, పిల్లలు, ఇతర ప్రజలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ముద్రగడ పద్మనాభం సంతాప సభ



విశాఖపట్నం, ఆగస్టు 9 : కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంతాప సభ విశాఖపట్నంలో విశాఖ కాపునాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ హాజరై ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని, ప్రజా జీవితంలో చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ముద్రగడ పద్మనాభంతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని బొత్స సత్యనారాయణ స్మరించుకున్నారు. ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు, కాపు సామాజిక వర్గం కోసం చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ పద్మనాభం ప్రజా జీవితంలో ప్రత్యేక ముద్ర వేశారని పలువురు నేతలు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఉద్యమ ప్రస్థానం, సామాజిక వర్గం కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. సంతాప సభలో మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కరణం ధర్మశ్రీ, మజ్జి శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా హాజరై ముద్రగడకు నివాళులర్పించారు. కార్యక్రమానికి అభిమానులు, కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పవన్‌పై విమర్శలు మానుకోవాలి



మంగళగిరి, ఆగస్టు 9 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని జనసేన పార్టీ నాయకులు విమర్శించారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డా. పెదపూడి విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి బేతపూడి విజయ్ శేఖర్ మాట్లాడారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పవన్ కళ్యాణ్ నిరంతరం పనిచేస్తున్నారని వారు పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో డోలీ రహిత గ్రామాల లక్ష్యంతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. ఇప్పుడు అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ వాటిని గుర్తించకుండా విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజల సమస్యలపై స్పందించని నాయకులు అభివృద్ధిని ప్రశ్నించడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. యువత గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని జనసేన నేతలు విమర్శించారు. గత పాలనలో నిరుద్యోగులకు హామీలు ఇచ్చి అమలు చేయలేదని, ఉద్యోగాల భర్తీ, నియామకాల విషయంలో యువతను నిరాశపరిచారని ఆరోపించారు. గంజాయి, మాదకద్రవ్యాల సమస్యను కూడా సమర్థంగా నియంత్రించలేకపోయారని అన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నప్పటికీ కొందరు ప్రజాప్రతినిధులు వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. జల్ జీవన్ మిషన్ వంటి కీలక కార్యక్రమాలకు కూడా హాజరు కాకుండా రాజకీయ విమర్శలకే పరిమితం అవుతున్నారని ఆరోపించారు.జగన్‌ను మెప్పించేందుకు విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఉపయోగపడే అంశాలపై దృష్టి పెట్టాలని జనసేన నాయకులు సూచించారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ రాజకీయ ఆరోపణలు కాకుండా నిర్మాణాత్మక చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# పూర్వ విద్యార్థుల సేవాభావం అభినందనీయం

**సిద్ధార్థ మెడికల్ కాలేజీకి రూ.75 లక్షల విలువైన 15 అత్యాధునిక వైద్య పరికరాల విరాళం**

**విద్యార్థులు,రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పూర్వ విద్యార్థుల సహకారం**




విజయవాడ,ఆగస్టు 09, (అనంత సూర్య ప్రతినిధి): సిద్ధార్థ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు తమ మాతృసంస్థపై ఉన్న మమకారంతో విద్యార్థులు,రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.75 లక్షల విలువైన 15 అత్యాధునిక వైద్య పరికరాలను విరాళంగా అందించిన కార్యక్రమానికి శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ, తాము విద్యనభ్యసించిన మాతృసంస్థకు పూర్వ విద్యార్థులు తిరిగి సేవలందించడం అభినందనీయమని అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా వైద్య పరికరాలను విరాళంగా అందించడం ద్వారా పూర్వ విద్యార్థులు తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారని కొనియాడారు. అత్యాధునిక పరికరాలు ఆసుపత్రిలో అందుబాటులోకి రావడం వల్ల వైద్య సేవలనుమరింతఆధునికీకరించడంతో పాటు,రోగులకు వేగవంతమైన, సురక్షితమైన వైద్య సేవలు అందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ముఖ్యంగా రక్త మార్పిడి సేవల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వల్ల రోగులకు సురక్షితమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు మొత్తం రూ.75 లక్షల విలువైన 15 అత్యాధునిక వైద్య పరికరాలను ఆసుపత్రికి అందజేశారు. వీటి ద్వారా ఆసుపత్రిలో వైద్య సేవల సామర్థ్యం మరింత పెరగడంతో పాటు,రోగులకు అవసరమైన సమయంలో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.వై. రావులు మాట్లాడుతూ విరాళంగా అందించిన పరికరాల్లో 'స్టెరైల్ కనెక్టింగ్ డివైజ్' అత్యంత ప్రాధాన్యత కలిగినదని వైద్యులు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు అవసరమయ్యే కొద్దిపాటి రక్తాన్ని కూడా తక్కువ మోతాదులో, అత్యంత సురక్షితమైన పద్ధతిలో సరఫరా చేసేందుకు ఈ పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి పరికరాలు చాలా తక్కువ ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ఈ పరికరం అందుబాటులోకి రావడం వల్ల చిన్నారులతో పాటు అవసరమైన ఇతర రోగులకు కూడా రక్త మార్పిడి సేవలను మరింత సురక్షితంగా అందించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఆధునిక జెల్ టెక్నాలజీ ఆధారిత పరికరాల వినియోగం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మంది రోగులకు రక్త సంబంధిత సేవలు అందించేందుకు వీలవుతుందని అధికారులు తెలిపారు. రక్త అనుకూలత పరీక్షలు,రక్త మార్పిడి ప్రక్రియలో ఈ సాంకేతికత కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గత ఆరు నెలల కాలంలో సుమారు 6 వేల మంది రోగులకు రక్తం సరఫరా చేసినట్లు తెలిపారు. ఆధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో భవిష్యత్తులో మరింత వేగంగా,సురక్షితంగా రక్త మార్పిడి సేవలను అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య పరికరాలు ఆసుపత్రిలోని వైద్య సేవల నాణ్యతను మరింత పెంచేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులకు ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు, రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకుఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్,సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.వై.రావు,పూర్వ విద్యార్థుల సంఘం సెక్రటరీ డాక్టర్ అమన్న, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రంజిత తదితరులు పాల్గొన్నారు..

# ఇంటింటికీ కూటమి అభివృద్ధి ప్రజల ముంగిట సంక్షేమం



నందిగామ,ఆగస్టు 09, (అనంత సూర్య ప్రతినిధి) నందిగామమండలం,అడవిరావులపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగానందిగామనియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అడవిరావులపాడు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. కూటమి నేతలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలు,నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, గ్రామంలో అవసరమైన మౌలిక వసతులు,అభివృద్ధి పనులపై స్థానికులతో చర్చించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని,అభివృద్ధిసంక్షేమం రెండు కళ్లుగా నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన

# ఎమ్మెల్యే యరపతినేని



గురజాల,ఆగస్టు 09, (అనంత సూర్య ప్రతినిధి): గురజాల పట్టణంలోని పల్లెగుంత గ్రామంలో గ్రామీణఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారంరాత్రిగురజాలశాసనసభ్యులు యరపతినేనిశ్రీనివాసరావు ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్నసందర్భంగా. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రినారాచంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీప్రతిష్టాత్మకంగానిర్వహిస్తున్న 2 ఏళ్ల నమ్మకం,సంక్షేమం,అభివృద్ధి ఇంటింటి ప్రచారం కార్యక్రమం ద్వారా గురజాల మండలం,పల్లెగుంత గ్రామం నందు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొనటం జరిగింది. ఈ రెండు సంవత్సరాల కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, ప్రజా సమస్యలు తెలుసుకోవడానికిగురజాలశాసనసభ్యులు. యరపతినేనశ్రీనివాసరావుగ్రామంలోని ఇంటింటికి వెళ్లి,రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వం గురజాల నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని మరియు సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించడం జరిగింది. గ్రామం నందు ఇప్పటి వరకు చేసిన, చేయబోయే 3.50 కోట్ల వివిధ అభివృద్ధి పనుల గురించి మాట్లాడటం జరిగింది. ఈసందర్భంగాగుంటూరు–మాచర్లఆర్‌డబిరోడ్డునుండి గోగులపాడు వయా పల్లెగుంత వరకూ 140.00 లక్షల రూపాయల అంచనాతో నూతనంగా నిర్మించనున్న తారురోడ్డు కి శంకుస్థాపన చెయ్యటం జరిగింది. అనంతరం ఈ సందర్భంగా 36 లక్షలలో గ్రామంలో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కుడి కాలువ ప్రాజెక్ట్ చైర్మన్ పులుకూరి కాంతారావు ,గురజాల మండల పార్టీ కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీ నారాయణ,గురజాల టౌన్ పార్టీ మాజీ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు వంకాయలపాటి వీరనారాయణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జాస్తి ప్రకాష్ రావు,డాక్టర్ ప్రవీణ్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బత్తుల మల్లారెడ్డి,గురజాల మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు,కార్యకర్తలు, మహిళలు,యువత పల్లెగుంట గ్రామంలోని రైతులు ప్రజలుపాల్గొనడం జరిగింది

# డీఎస్సీ అక్రమాలపై జగ్గయ్యపేటలో నిరసన దీక్ష

## మూడో రోజు రిలే నిరాహార దీక్షను ప్రారంభించిన తన్నీరు నాగేశ్వరరావు



జగ్గయ్యపేట ఆగస్టు 09,.: డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో భారీ అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష మూడో రోజుకు చేరుకుంది. మూడో రోజు దీక్షను వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ప్రారంభించారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి, జగ్గయ్యపేట మండలాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో దీక్షలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దీక్ష శిబిరం జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నర్సింహారావు, వత్సవాయి మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కష్టపడి చదివిన నిరుద్యోగుల ఆశలను కూటమి ప్రభుత్వం అడియాశలు చేసిందని, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ అవకాశాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థులు, నిరుద్యోగులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని, అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించే పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని తన్నీరు నాగేశ్వరరావు స్పష్టం చేశారు. "ప్రజలను మోసం చేసే పాలనను ఇక భరించేది లేదు.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ప్రభుత్వాన్ని నిలదీస్తాం.. నిరుద్యోగుల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతాం" అని ఆయన హెచ్చరించారు. డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడి, ఉద్యోగాలను లక్షల్లో అమ్ముకొని లబ్ధి పొందిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిని కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను నట్టేట ముంచుతున్నారని తన్నీరు నాగేశ్వరరావు




విమర్శించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు నేటితో ముగుస్తాయని, అయితే పోరాటం మాత్రం ఆగదని తెలిపారు. సోమవారం జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అనంత సూర్య

సోమవారం 10 ఆగస్టు 2026

# ఆర్‌డీఎస్ఎస్ పథకంతో బండిపాలెం పరిధిలో విద్యుత్ వ్యవస్థ బలోపేతం

జగ్గయ్యపేట,ఆగస్టు 09,( అనంత సూర్య ప్రతినిధి): జగ్గయ్యపేట మండలం,బండిపాలెం, పొచంపల్లి,గుండబోయిన పాలెం పరిసర ప్రాంతాల ప్రజలకు నిరంతర విద్యుత్తు సరఫరా అందించాలనే లక్ష్యంతో ఆర్‌డీఎస్ఎస్ (రీక్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) పథకం ద్వారా భారీ స్థాయిలో విద్యుత్ మౌలిక వసతులఅభివృద్ధిపనులుచేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. బండిపాలెం పరిధిలో విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న లో-వోల్టేజ్,తరచూ విద్యుత్ అంతరాయాలు,పాత విద్యుత్ మౌలిక వసతుల సమస్యలను గుర్తించిన జగ్గయ్యపేట శాసనసభ్యులు,తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఈ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేకంగా దృష్టి సారించారు.ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చించి, అవసరమైన విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయించి, ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా నిధులు మంజూరయ్యేలా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ ప్రాంత విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పనుల పురోగతిపై నిరంతరం సమీక్షిస్తూ వేగవంతం చేయడానికి కృషి చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎమ్మెల్యే తాతయ్య వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు పేర్కొన్నారు.బండిపాలెం పరిధిలో విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి ఆర్‌డీఎస్ఎస్ పథకం మంజూరు కావడంలో,పనులు ప్రారంభమయ్యే స్థాయికి తీసుకురావడంలో ఎమ్మెల్యే గారి చొరవ, నిరంతర పర్యవేక్షణ కీలకంగా నిలిచిందని అధికారులు, స్థానిక ప్రజలు అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బండిపాలెం గ్రామ ప్రజలతో కలిసి విద్యుత్ శాఖ చేపడుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని,నాణ్యతా ప్రమాణాలకు ఎక్కడా రాజీ పడకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా భారీగా విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి.ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద బండిపాలెం,పొచంపల్లి, జీబీ పాలెం పరిసర ప్రాంతాల్లో 100 కేవీఏ సామర్థ్యం కలిగిన 19 ట్రాన్స్‌ఫార్మర్లు, 63 కేవీఏ సామర్థ్యం కలిగిన 6 ట్రాన్స్‌ఫార్మర్లు మొత్తం 25 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నారు.అదేవిధంగా 816 విద్యుత్ స్తంభాలు,సుమారు 13.5 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లైన్, 11 కిలోమీటర్ల ఎల్‌టీ విద్యుత్ లైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.ఈ పనులు పూర్తయిన అనంతరం బండిపాలెం,పొచంపల్లి,గుండెబోయిన పాలెం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సామర్థ్యం గణనీయంగా మెరుగుపడనుంది.ముఖ్యంగా లో-వోల్టేజ్‌తరచూ విద్యుత్ అంతరాయాల సమస్యలు తగ్గి, గృహ,వాణిజ్య వినియోగదారులకు నిరంతర విద్యుత్తు సరఫరా అందుబాటులోకి రానుంది.ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటికి శాశ్వత పరిష్కారం చూపించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్యుత్, రహదారులు,తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.బండిపాలెం పరిధిలో విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి చేపడుతున్న ఈ పనులు ప్రజల దీర్ఘకాలిక



అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడ్డాయని, పనులు పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ తాను స్వయంగా పర్యవేక్షిస్తానని ఎమ్మెల్యే తాతయ్య తెలిపారు.ప్రజల సహకారంతో అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి, జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన సంకల్పమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు,మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అడుసుమల్లి ప్రభాకర్,ఇన్నమూరి రమేష్, కాసరగడ్డ రవి, నెమలి రత్నాకర్,బండి శ్రీకాంత్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ శ్రీనివాసరావు,చిల్లకల్లు ఏఈ రమేష్ బాబు,విద్యుత్ శాఖ సిబ్బంది,స్థానిక నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది కుటుంబానికి పెద్దదిక్కుగా అధినేత కేసీఆర్

హైదరాబాద్,ఆగస్టు09(అనంత సూర్య ) ప్రతినిధి) : స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయంపార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్న అధినేత కేసీఆర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు, ఇందులో భాగంగా సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయంచేయాలనినిర్ణయించారు,అదే సమయంలో,పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున ఆమె బాగోగుల కోసం మరో రూ.25 లక్షలను ఆమె పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు,తద్వారా మొత్తంగా రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అందిస్తూ బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని నిర్ణయించింది,ఇంతటితోనే కాకుండా పిల్లల భవిష్యత్తు,వారి చదువు,ఇతర కుటుంబ సంక్షేమ అంశాలకు సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని అధినేత కేసీఆర్ తెలిపారు.



# బీరంగూడలో సీసీరోడ్డు ప్రారంభోత్సవం చేసిన కాట దంపతులు

పటాన్‌చెరు,ఆగస్టు 09,(అనంత సూర్య ప్రతినిధి): బీరంగూడ డివిజన్ పరిధిలోని ఎస్.ఎల్.ఎన్. హోమ్స్ నుంచి నల్లూరి హైట్స్ అపార్ట్మెంట్స్ వరకు మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి సొంత నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు,కాట దంపతులు మాట్లాడుతూ.ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వ్యక్తిగతంగా ముందుకొచ్చి సీసీ రోడ్డు నిర్మించడం అభినందనీయమన్నారు. రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శిగా బొమ్మెర నరేందర్ నియామకం

చెన్నారావుపేట, ఆగస్టు 09, (అనంత సూర్య ప్రతినిధి): వరంగల్ జిల్లా, కాంగ్రెస్ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శిగా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు బొమ్మెర నరేందర్ ని నియమించినట్టు కాంగ్రెస్ జిల్లా డిపార్ట్మెంట్ చైర్మన్ అధ్యక్షులు చిలివేరు శ్రీనివాస్ ఒక ప్రకటనలోతెలిపారు.నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసరం ఈ రోజు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆయుబ్ సూచన మేరకు చెన్నారావుపేట పార్టీ అధ్యక్షులు సిద్దన రమేష్ ప్రతిపాదనతో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సి డిపార్ట్మెంట్ అధ్యక్షులు నియామక పత్రాన్ని అందించారు.ఈ



సందర్బంగా నరేందర్ మాట్లాడుతు నా మీద నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కి. జిల్లా అధ్యక్షుడు అయూబ్ కి ఎస్సి డిపార్ట్మెంట్ అధ్యక్షులు చిలువేరు శ్రీనివాస్ కి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులకు,చెన్నారావుపేట మండల అధ్యక్షులు సిద్దన రమేష్ కి సొసైటీ చైర్మన్ లు భూక్య గోపాల్ నాయక్ కి మొగిలి వెంకట్ రెడ్డి కి మండల కమిటీ నాయకులకు గ్రామ పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్బంగా నరేందర్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో సమ్మయ్య నర్సయ్య రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ వి అకాడమీ ఆధ్వర్యంలో బోనాల సంబరాలు





ఎర్రుపాలెం,ఆగస్టు 09, (అనంత సూర్య ప్రతినిధి): ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెం,మండల కేంద్రంలో ఉన్న, ఎస్ వి అకాడమీ,ఆధ్వర్యంలో శనివారం, ఘనంగా బోనాల సంబరాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యార్థులచే కోలాటం,మరియు పోతురాజు వేషధారణలో విద్యార్థులు,అనేక సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులచే నిర్వహించడం జరిగింది,ఈకార్యక్రమంలో,ప్రిన్సిపాల్ తొండ సతీష్ కుమార్ సార్,మరియు కరస్పాండెంట్, మిరియాల శ్యాంప్రసాద్ సార్,గౌరవ సలహాదారులుగిరి, మరియు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

# ఆటో డ్రైవర్ల సమస్యలకు స్పందించిన ఎమ్మెల్యే

గురజాల,ఆగస్టు 09, (అనంత సూర్య ప్రతినిధి): గురజాల మండలం గంగవరం గ్రామంలో సుమారు 17 మంది ఆటోలు నడుపుతూ తమ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ ఆటో డ్రైవర్ల సమస్యలను గ్రామంలోని నాయకుల ద్వార గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.ముఖ్యంగా గంగవరం నుంచి దైద,అమరలింగేశ్వర స్వామి ఆలయం వరకు ప్రతిరోజూ ఆటోలు నడుపుతూ ప్రయాణికులకు సేవలు అందించేందుకు కొంతమంది అడ్డంకులు కల్పిస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి



తీసుకెళ్లారు.ఆటో డ్రైవర్ల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, తమకు కూడా స్వేచ్ఛగా ఆటోలు నడుపుకునే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే ని కోరడం జరిగింది.ఈ సమస్యపై ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తక్షణమే స్పందించి, సంబంధిత సీఐ ఎం మురళి తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. గంగవరం గ్రామంలో ఆటోలు నడుపుతున్న డ్రైవర్లు తమకు అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లి ప్రయాణికులకు సేవలు అందించుకునేలా ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని సూచించారు.ఆటో డ్రైవర్ల జీవనోపాధికి అండగా నిలిచి, సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు స్పందించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కు గంగవరం ఆటో డ్రైవర్లు, గ్రామప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలుతెలియజేశారు. పేద, మధ్యతరగతి వర్గాల జీవనోపాధికి అండగా నిలుస్తున్న గురజాల శాసనసభ్యులు ఎరపతినేని శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి కి ఘన నివాళులు అర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



చెన్నారావుపేట,ఆగస్టు 09, (అనంత సూర్య ప్రతినిధి) : చెన్నరావుపేట, మండల కేంద్రం మరియు అమీనాబాధ్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కార్యక్రమ,సంతాప సభ అన్నదాన కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజా సేవలో అందించిన సేవలను, తెలంగాణ ఉద్యమంలో పోషించిన కీలక పాత్రను,బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి చేసిన కృషిని స్మరించుకున్నారు.నర్సంపేట కి సాగునీరు,మెడికల్ కాలేజీ, తెచ్చిన ఘనత పెద్ది సుదర్శన్ రెడ్డి కే దక్కుతుంది.ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి,తెలంగాణ ఉద్యమానికి,ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిద్దాం.

# సెయింట్ ఆన్స్ విద్యార్థి అమరావతి ఛాంపియన్ షిప్ కు ఎంపిక

ఇబ్రహీంపట్నం,ఆగస్టు09,అనంత సూర్య ప్రతినిధి): ఇబ్రహీంపట్నం సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థి అమరావతి ఛాంపియన్, ఎంపికయ్యాడు. విజయవాడ ఎంబీపీ స్టేడియంలో జూలై 5న జరిగిన జిల్లా సెలక్షన్స్ లో సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థి ఒ కుసుమ మనోహర్ అండర్ 17 బాలుర హై జంప్ విభాగంలో పాల్గొని ప్రథమ స్థానం సాధించాడు.ఈ విజయంతో అమరావతి ఛాంపియన్ షిప్ కు అర్హత సాధించాడు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ జయప్రద పిఇటి కుమార్ ఉపాధ్యాయులు విద్యార్థి విజయంపై హర్షం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో రాష్ట్ర జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు ఈ విజయం తమ పాఠశాలకు గర్వకారణమని తెలిపారు.



# ప్లాస్టిక్‌తో..'ఢీ' ఒక్క అడుగు





**అనంతపురం, ఆగస్టు 9 అనంత సూర్య :**

**ఒక్కడై రావడం ఒక్కడిగా మార్పు కోసం. ఏదైనా ఒక్కరితోనే మొదలవుతుందని చెప్పనవసరం లేదు. ఏ చరిత్ర తీసుకున్నా.. అవును అదే నిజమనిపిస్తుంది. అందులో ఇది కూడా ఒక ఉదాహరణగా చరిత్రపుటల్లో ఎక్కనుందా.. అనంతపురం నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కోసం పౌర బాధ్యతను చాటుతో ప్లాస్టిక్‌తో 'ఢీ'కొట్టేందుకు ఒక్క అడుగు అటువైపుకు వేసి వందలాది మందిని ఆ వైపుకు ప్రేరేపితం చేసి డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్ తన పేరును సార్థకం చేసుకుంటున్నాడు.**

### హెచ్చెల్సీ కాలువలో ప్లాస్టిక్ ప్రక్షాళనకు సైన్యంగా సైనికుడై..

కనీవిని ఎరగని రీతిలో హెచ్చెల్సీ కాలువలో అపరిశుభ్రతను పారద్రోలేలా ప్రక్షాళనకు అనంతపురం పౌరులను భాగస్వాములుగా చేసుకున్నాడు. 120 నిమిషాల్లో 150 మంది పౌరుల భాగస్వామ్యంతో దాదాపు 5,000 కిలోల ప్లాస్టిక్, చెత్త తొలగింపు చేపట్టారు. నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల పౌర బాధ్యతను చాటుతూ అనంతపురంలో దాదాపు 150 మంది పౌరులు ఒక్కటై హెచ్ఎల్సీ కాలువను శుభ్రం చేశారు. ప్లాస్టిక్, చెత్తతో నిండిపోయిన కాలువను కేవలం 120 నిమిషాల్లో శ్రమదానంతో శుభ్రం చేసి, సుమారు ఆరు ట్రాక్టర్ లోడ్లకు సమానమైన దాదాపు 5,000 కిలోల ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు.

**క్లీన్ డ్రైవ్ ఫర్ ఏ క్లీన్ అండ్ గ్రీన్ అనంత పురం పేరుతో..** నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమాన్ని డిస్కవర్ అనంతపురం, రోటరీ క్లబ్ ఆఫ్ అనంతపురం, ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ, అనంతపురం యువత సంయుక్తంగా చేపట్టాయి. డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకులు ఏ.జి. అనిల్ కుమార్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తను స్వయంగా తొలగిస్తూ పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 150 మంది పౌరుల సమిష్టి శ్రమ చూస్తే ఎవరైనా సరే కరచాల ధ్వనులతో హర్షం వ్యక్తం చేయాల్సిందే. చాలాకాలంగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండిపోయిన హెచ్ఎల్సీ కాలువను శుభ్రం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. 120 నిమిషాల పాటు సాగిన ఈ శుభ్రత కార్యక్రమంలో దాదాపు 5 వేల కిలోల వ్యర్థాలను తొలగించడం కార్య క్రమం స్థాయిని, పౌరుల భాగస్వామ్యాన్ని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమ విజయవంతం కావడంలో పలువురు వ్యక్తులు, సంస్థలు కీలక పాత్ర పోషించాయి. రోటరీ క్లబ్‌కు చెందిన ఏజి. వేణుగోపాల్ రెడ్డి, సుధీర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడంలో కీలకంగా వ్యవహరించారు. అలాగే అనంతపురం కాక్రోచెస్‌కు చెందిన సోహైల్, నందా, లోకేష్.. వారి బృందంలి శుభ్రత కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని కాలువలోని ప్లాస్టిక్, చెత్తను తొలగించడంలో కీలకంగా సహకరించారు. ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీకి చెందిన సంజీవ్ రెడ్డి, వారి బృందం కూడా కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమవంతు సహకారాన్ని అందించారు. వారి భాగస్వామ్యంతో పాటు అనంతపురం యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేసింది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల చురుకైన భాగస్వామ్యం కూడా తోడైంది. ఈ కార్యక్రమానికి మరో ప్రధాన ఆకర్షణగా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, వారి బృందం స్వయంగా పాల్గొని శుభ్రత కార్య క్రమంలో చురుకుగా పనిచేయడం నిలిచింది. పౌరులతో కలిసి మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో పాల్గొని కాలువను శుభ్రం చేయడం ద్వారా ప్రజలు-పాలక వ్యవస్థ కలిసి పనిచేస్తే నగర పరిశుభ్రతలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమంతో చూపించారు. పౌరులు-మున్సిపల్ కార్పొరేషన్ కలిసి పనిచేయడానికి ఇదొక చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది. ఈ కార్యక్రమం కేవలం ఒక ప్రాంతాన్ని శుభ్రం చేసే కార్యక్రమంగా కాకుండా పౌర భాగస్వామ్యం, స్వచ్ఛంద సంస్థల కృషి, యువత చొరవ, మున్సిపల్ యంత్రాంగం సహకారం కలిసి పనిచేస్తే నగరంలోని దీర్ఘకాలిక సమస్యలను కూడా పరిష్కరించవచ్చని నిరూపించింది.







**ఈ సందర్భంగా డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకులు ఏ.జి. అనిల్ కుమార్ మాట్లాడుతూ..** ఈ కార్యక్రమం ఉద్దేశ్యం కేవలం హెచ్ఎల్సీ కాలువను శుభ్రం చేయడం మాత్రమే కాదని, నగర పరిశుభ్రతలో ప్రతి పౌరుడిని భాగస్వామిని చేయడం ద్వారా ఒక నిరంతర ప్రజా ఉద్యమాన్ని నిర్మించడమే లక్ష్యమని తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చగా ఉంచేందుకు ప్రజలు తమ సమయాన్ని, శ్రమను అందించేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ కార్యక్రమానికి లభించిన స్పందన స్పష్టం చేసిందన్నారు.

- ఓ యుద్ధంలా హెచ్చెల్సీ కాలువ ప్రక్షాళన
- సైన్యంలో సైనికుడై కదిలిన అనంతపురం అనిల్ కుమార్
- 5 వేల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డ్‌కు తరలింపు
- క్లీన్ అండ్ గ్రీన్ అనంతపురం కోసం.. ప్రజా ఉద్యమానికి శ్రీకారం
- తొలి రోజు రోటరీ క్లబ్, కాక్రోచ్, ఎస్సార్ డిఫెన్స్, అనంత యువత, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ బృందం చేయూత
- బృహత్తర కార్యక్రమాలకు అనంత ప్రజానీకం అడుగడుగునా అభినందనలు

### ప్రతివారం ఓ కార్యక్రమానికి శ్రీకారం :

ప్రతివారం అనంతపురం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇలాంటి శుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తామని, నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ అనంతపురంగా తీర్చిదిద్దేందుకు నిరంతర ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తామని అనిల్ కుమార్ తెలిపారు. చెత్త తొలగించడం మాత్రమే కాదు.. మళ్లీ చెత్త పేరుకుపోకుండా చూడాలని ప్రతిజ్ఞ చేశారు. కాలువలు, డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాల్లోకి ప్లాస్టిక్, చెత్త చేరకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఒకసారి వేల కిలోల చెత్తను తొలగించడం తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే శాశ్వత మార్పు సాధ్యమవుతుందని వారు తెలిపారు. హెచ్ఎల్సీ కాలువ శుభ్రత కార్యక్రమం అనంతపురంలో ఒక కొత్త పౌర భాగస్వామ్యానికి నాంది పలికిందని చెప్పవచ్చు. ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, మున్సిపల్ అధికారులు ఒకే లక్ష్యంతో కలిసి పనిచేస్తే నగరాన్ని మరింత పరిశుభ్రంగా మార్చడం సాధ్యమేనని ఈ కార్యక్రమం నిరూపించింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన 150 మంది పౌరులు, రోటరీ క్లబ్ సభ్యులు, అనంతపురం కాక్రోచెస్ బృందం, ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ, అనంతపురం యువత, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, వారి బృందానికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎల్సీ కాలువ శుభ్రతతో ఈ ఉద్యమం ఆగిపోదని, ప్రతి వారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో మరిన్ని శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి **"క్లీన్ అండ్ గ్రీన్ అనంతపురం"** లక్ష్యంగా నిరంతర ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని డిస్కవర్ అనంతపురం అనిల్ వెల్లడించారు.



## శాంతినిలయం ఆశ్రమంలో ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు



బోనకల్ ఆగస్టు 09 : సూపర్ స్టార్, సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలను బోనకల్‌లోని శాంతినిలయం ఆశ్రమంలో పోలంపల్లి గ్రామానికి చెందిన మహేష్‌బాబు అభిమానుల ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి, అనంతరం వారికి అల్పాహారం, అన్నదానం అందజేశారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ.. తమ అభిమాన కథానాయకుడు మహేష్‌బాబు కేవలం వెండితెరపైనే కాక, నిజ జీవితంలోనూ రియల్ హీరోగా కోట్లాదిమంది హృదయాల్లో నిలిచారని కొనియాడారు. "మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తితో మహేష్ ఫౌండేషన్ ద్వారా వేలాది మంది పేద చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల్లోని రెండు గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం మహేష్ బాబు గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

## సాహిత్యవిమర్శను శాస్త్రీయ స్థాయికి తీసుకుపోవాలి

- నెల్లుట్ల వేణుగోపాల్
- మానవ సంబంధాల చిత్రణే సాహిత్యం
- ఆచార్య రాచపాలెం
- ముగిసిన అరసం "సాహిత్య విమర్శ - పాఠశాల"



**అనంతపురం, ఆగస్టు 9 అనంత సూర్య :**

సాహిత్య విమర్శ ఒక మేధోప్రక్రియ, చర్చ, సంవాదం లాంటిదని, అభ్యుదయవాదులు సమిష్టికృషితో విమర్శను శాస్త్రీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రముఖ సాహితీవేత్త "వీక్షణం" పత్రిక సంపాదకులు నెల్లుట్ల వేణుగోపాల్ అన్నారు. సమాజాన్ని పరావర్తనం చెందించేదే సాహిత్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో "సాహిత్య విమర్శ – పాఠశాల" రెండు రోజులపాటు ఘనంగా సాగింది. ఆర్డీటి ఎకాలజీ సెంటర్లో ఆదివారం జరిగిన తరగతులకు, సభలకు, అరసం జిల్లా అధ్యక్షులు భీమిరెడ్డి ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. "సాహిత్య విమర్శ – విభిన్న ధోరణులు", "మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ" అనే అంశాలపై ఎన్.వేణుగోపాల్ సుదీర్ఘంగా ఉపన్యసించారు. "సాహిత్య విమర్శ వికాసం" అనే అంశంపై అరసం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారామ్ "విమర్శకుని అనుభవాలు" చక్కగా వివరించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ.. సాహిత్య విమర్శకులు విస్తృత అధ్యయనం, నిరంతర సాధన కొనసాగించాలన్నారు. ప్రపంచీకరణ తర్వాత, అసహన రాజ్యం మొదలయ్యాక ప్రజాస్వామిక చర్చకు అవకాశం లేకుండా పోయిందన్నారు. సృజనకారుల్లో కూడా కీర్తికాంక్ష పెరిగి, విమర్శను, సవరణను అంగీకరించలేని ఒక స్థితి నెలకొందన్నారు. విమర్శకులకు సాహిత్య చరిత్ర మీద స్థూలమైన అవగాహన ఉండాలని, సృజనకారుల కన్నా ఎక్కువ అధ్యయనం చేయాలని సూచించారు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అవగాహనను పెంచుకోవాలన్నారు. భిన్నరంగాల పట్ల విహంగ వీక్షణం చేసి మేధావిగా ఉండాలన్నారు. ఉపపత్తులతో గుణ, దోష విచారణ చేసినప్పుడే శాస్త్ర ప్రతిపత్తి సంతరించుకుంటుందన్నారు. ఆధునిక సాహిత్య విమర్శలో వైజ్ఞానిక వాదం, ఆస్తిత్వ, వాచక కేంద్ర, రూపవాద – ప్రక్రియవాద, ఆధునికానంతర, పర్యావరణ వాద, సత్యానంతర, సామాజిక శాస్త్ర సాహిత్య విమర్శ, ఉపాంత వర్గాల వాద విభిన్న ధోరణులున్నాయన్నారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా సిద్ధాంత పత్రం, సదస్సు పత్రాలు ప్రామాణికంగా వుండాలని సూచించారు. సాహిత్య విమర్శకులు మరింత విరివిగా రావాలని, తర్క వితర్కాలు, వాద వివాదాల ద్వారా కూడా సాహిత్య విమర్శ అభివృద్ధి చెందిందన్నారు. తెలుగులో 8 దశాబ్దాల చరిత్ర గల మార్క్సిస్టు సాహిత్య విమర్శ మీద మరింతగా పరిశోధించాల్సి ఉందన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత, ఏపీ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు, సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మానవ సంబంధాల చిత్రణే సాహిత్యమన్నారు.

ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శులు శరత్ చంద్ర జ్యోతిశ్రీ, ఏఎంఆర్ ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి డా.తన్నీరు నాగేంద్ర, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ శాంతి నారాయణ, గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా, ఏ.చంద్రశేఖర్, ఎస్వీ యూనివర్సిటీ తెలుగు విభాగ అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎం.ఆదిశేషయ్య, కవులు అశేరా, మధురశ్రీ, డాక్టర్ జూటూరి షరీఫ్, డాక్టర్ అనితమ్మ, ద్రాక్షాయణి, హేమలత, స్వర్ణలత, పుల్లా రామాంజనేయులు, గంగిరెడ్డి విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహేష్ బాబు జన్మదిన వేడుకలు



**అనంతపురం, ఆగస్టు 9 అనంత సూర్య :**

సినీ నటుడు, సూపర్ స్టార్ మహేష్‌బాబు 51వ జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ఘనంగా నిర్వహించారు. కృష్ణ సేన నాయకులు కేఆర్ కుల్లాయప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ రాగే పరశురామ్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణ, మహేష్ అభిమానులు వారి నటులను ఆదర్శంగా తీసుకుని పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని.. మున్ముందు కూడా సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. మహేష్ బాబు గుండె జబ్బుల బారినపడిన అనేక పేద కుటుంబాలకు ఉచితంగా ఆపరేషన్లు చేయించి వారి కుటుంబాల్లో వెలుగు నింపారని, వారిని ఆదర్శంగా తీసుకుని కృష్ణ, మహేష్ అభిమానులు సమాజ సేవా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని రాగే పరశురాం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, కృష్ణ, మహేష్ సేన నాయకులు రవిరాజ్, నారాయణ రెడ్డి, రఫీ, శేఖర్, హరి, వెంకటేష్, రఘు, ప్రభుదాస్, అరవింద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన



**అనంతపురం, ఆగస్టు 9 అనంత సూర్య :**

నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మల మురళి ఆధ్వర్యంలో కోవూరునగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆదివారం స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో విద్యార్థులకు చదువు, విలువలు, జీవిత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని చదువులో కొనసాగించాలన్నారు. చదువులో విజయం సాధించగలిగితే భవిష్యత్తులో జీవితంలోనూ విజయం సాధిస్తామని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. పెద్దల ఆశీస్సులు ఉంటే జీవితంలో కుటుంబ బాధ్యతలు, జీవన విధానాలు అలవాడుతాయన్నారు. ప్రతి విద్యార్థి తన అనుకున్న లక్ష్యాలను చేరుకునే వరకు పట్టు వదలని శ్రమతో కష్టపడాలన్నారు. కష్టపడి విజయం సాధించిన వారే ఎంతోమంది చరిత్రలో నిలిచిపోయారన్నారు. అలాంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గురువాయూరప్పుని ఉణ్ణియప్ప సేవ వెనుక దివ్యలీలాను వివరించారు. గురువాయూర్ ఆలయంలో ఒక పవిత్ర ఏకాదశి సందర్భంగా గురువాయూరప్పకు అత్యంత ప్రీతిపాత్రమైన ఉణ్ణియప్పం (అప్పం) నైవేద్యాన్ని సిద్ధం చేసే పనిలో ప్రధాన అర్చకులు నిమగ్నమై ఉన్నారని, వారికి సహాయంగా ఉన్న శిష్యుడు పూలు తీసుకురావడానికి బయటకు వెళ్లడంతో జరిగిన సంఘటనలు వివరించారు. సహాయం చేసే విలువతో పాటు డబ్బు విలువను, అలాగే ప్రకృతి విలువను కోవాలని సూచించారు. ప్రతి వ్యక్తి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి తోటి వారికి సహాయం చేసే గుణం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్వామి సత్యాత్మానంద, చక్రపాణి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటికి...నగరంలో భారీ ఏర్పాట్లు




అనంతపురం, ఆగస్టు 9 అనంత సూర్య : అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలకు నియోజకవర్గంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఆగస్టు 10(సోమవారం) రోజున ఈ వేడుకలు జరగనున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఈ వేడుకల్ని భారీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ముఖ్యంగా నగరంలోని 50డివిజన్లు, నాలుగు పంచాయతీల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. నగరంలో ఎక్కడ చూసినా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రధాన వీధులతో పాటు ప్రతి డివిజన్ లోనూ ఇలాంటివి కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రి, రాంనగర్ బ్రిడ్జి దగ్గర నుంచి అర్బన్ టీడీపీ కార్యాలయంలో వరకు ఫ్లెక్సీలతో నింపేశారు. గతంలో అర్బన్ కార్యాలయంలో భారీగా వేడుకలు నిర్వహించే వారు. ఈసారి అలా కాకుండా ఎక్కడికక్కడ ఏ డివిజన్ లో వారు నిర్వహించుకోవాలని దగ్గుపాటి కార్యాలయ సిబ్బంది సూచించారు. మరోవైపు దగ్గుపాటి ఫౌండేషన్ తో పాటు టీడీపీ నాయకులు కూడా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు వెల్లడించారు. అన్నదానం, రక్తదానంతో పాటు వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు ఉంటాయని చెబుతున్నారు. దగ్గుపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని మూడు అన్న క్యాంటీన్లలో మూడు పూటలా ఉచితంగా భోజనం అందించబోతున్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405